# హైరేంజ్ సిగ్నేచర్



**డిసెంబరు** ఒకటవ తేదీ ఉషఃసమయాన జగత్తు నిద్రమత్తు వదిలించుకో ప్రయత్నిస్తూ ఒళ్ళు విరుచుకుంటున్నప్పుడు, విజయవాడ రైల్వే ప్లాట్‌ఫారంపై 'హెచ్చు తరగతి' పురుషుల విశ్రాంతి గదిలో కూర్చుని విసుగ్గా కళ్ళు మూసుకున్నాడు సుందరమూర్తి.

నియాన్ లైట్లు కళ్ళు జిగేలు మనిపిస్తున్న ప్లాట్‌ఫారం బయట ఉన్న ప్రపంచంలో అంధకారం తొలగి వెలుగురేఖలు బయటపడడానికి ప్రయత్నిస్తున్నాయి.

మెయిలు రాకకు అయిదు నిమిషాల వ్యవధి మాత్రమే సూచించింది సుందరమూర్తి ముంజేతికి ఉన్న కంకణంలాంటి గడియారం.

కోటు కాలరు సవరించుకుని టై సరి చేసుకుని హెచ్చు తరగతి పురుషుల విశ్రాంతి గదిలోనుంచి బయటికి వచ్చాడు సుందరమూర్తి.

'హెచ్చు తరగతి' స్త్రీల విశ్రాంతి గది ముందు ఎర్రంచు సిల్కు చీరె కనపడింది.

"గంటనుంచి వెయిట్ చేస్తున్నాను నీకోసం" అన్నాడు విసుగ్గా.

ప్లాట్‌ఫారం అవతల సన్నగా కురుస్తున్న మంచు, సన్నని తెరలాగా ఆవరించి, ఎర్రంచు సిల్కు చీరె అమ్మాయి ముఖానికి వేసుకున్న పౌడరు పూతలా ఉంది.

"నేను నిద్ర లేచేసరికి లేట్ అయింది, మూర్తీ. వెరీ సారీ" అన్నది బాకుల్లాంటి ఎర్రరంగువేసిన గోళ్ళతో గుర్రపుతోకలా బిగించి కట్టిన జుత్తును నిమురుకుంటూ.

మెయిలు వస్తున్నదన్న ప్రకటన వెలువడుతూండగానే రకరకాల వ్యక్తులను భరించి పరిగెత్తుతున్న ఆయాసంతో రొప్పుతూ ఆగింది మెయిలు.

మరో పదిహేను నిమిషాలకు నీలిరంగు కాశ్మీర్ శాలువ కప్పుకుని నిద్రలేని కళ్లలో ప్లాట్‌ఫారమంతా కలయజూస్తూ చేతిలో యాపిల్ పళ్ళ ప్లాస్టిక్ బుట్ట పట్టుకుని మెయిలులో రొప్పు

కుంటూ వచ్చింది నిర్మల.

ఫస్టు క్లాసు కంపార్టుమెంటు కిటికీలోనుంచి కనపడుతున్న బూడిద రంగు కోటునూ, దానికి అనుకున్న గుర్రపుతోకనూ నింపాదిగా చూసి నెమ్మదిగా వెనుదిరిగింది. యాపిల్ పళ్ల ప్లాస్టిక్ బుట్ట బరువుగా తోచింది.

భీకరంగా గర్జించి విజయవాడ స్టేషను వదిలింది మెయిలు.

మెయిలుతోపాటు ఆకాశంలో ఏ మూల ఎక్కడో నల్లని మెయిలు కదిలింది.

"నమస్కారమమ్మా. ఊరికెళ్లలేదా మీరు?" అన్నాడు భద్రయ్య, ఓవర్ బ్రిడ్జి మెట్లు ఎక్కుతున్న నిర్మలను చూసి విస్మయంగా.

మెట్లు దిగి స్టేషనులోకి వస్తున్నాడు భద్రయ్య.

"నువ్వా, భద్రయ్యా! కులాసాగా ఉన్నావా?" అన్నది నిర్మల పెదవులమీద నవ్వు తెప్పించు కుంటూ.

"అయ్యగారు వెళ్లారా, అమ్మా? నే పట్టుకొస్తా ఇలా ఇవ్వండి బుట్ట" అంటూ బుట్ట తీసుకున్నాడు భద్రయ్య.

బరువు తీరినట్లే అనిపించింది కొంచెం సేపు.

"మీ ఒంట్లో ఎలాగుందమ్మా?" అన్నాడు మళ్లీ భద్రయ్య.

"బాగానే ఉంది" అంది నిర్మల పొడిగా.

"మీకేం బాగాలేదనీ, మిమ్మల్ని మద్రాసు తీసుకువెళ్లి దించిరావాలనీ చెప్పారమ్మా అయ్యగారు. అందుకేగా పదిహేను రోజులు సెలవు పెట్టారు?" అన్నాడు భద్రయ్య.

భద్రయ్య మాటలు కర్కశంగా ఉన్నాయేమో ననిపించాయి నిర్మల చెవులకు.

"అవును, భద్రయ్యా! కానీ, ఇంతలోకి ఆయన స్నేహితు డొకాయనకు విశాఖపట్నంలో జబ్బుచేసింది, రమ్మని టెలిగ్రాం వస్తే ఇప్పుడే మెయిలుకు వెళ్లారు....ఆయన కోసమవి యాపిల్ పళ్లు కొన్నారు. మరిచిపోతే అందిద్దామని తెచ్చాను. నేనొచ్చేసరికే మెయిలు కదిలింది" అన్నది నిర్మల ఆయాసంగా. ఓవర్ బ్రిడ్జికి చాలా మెట్లున్నవని ఆమెకు పూర్వం తెలియదు. కారు తలుపు తీశాడు డ్రైవరు.

"బుట్ట ఇదుగోనమ్మా" అన్నాడు భద్రయ్య.

"మీ ఇంటికి తీసుకెళ్లు, భద్రయ్యా—నాకెందుకు? మీ పిల్లలకు పెట్టు" అన్నది నిర్మల తలుపు వేసుకుని.

భద్రయ్య కళ్లలో సంతోషం వెల్లివిరిసింది. నిర్మల జాలిగా నవ్వుకుంది. కారు అద్దపు కిటికీలో నుంచి విజయవాడ వీధులు జీవం లేనట్లు కనపడ్డాయి. ప్రపంచంలో ఏదో లోపించింది. అదేదో అర్థంకాలేదు నిర్మలకు. ఛాతీలో సన్నగా నెప్పి కలిగింది. కళ్లు మూసుకుని పడుకుంది నీరసంగా.

"ఒంట్లో బాగాలేదా, వదినా?" అడిగాడు

**ప్రేమించిన పురుషుడు కొట్టినా, తిట్టినా, రాచిరంపాన పెట్టినా సహిస్తుంది స్త్రీ. ఆమె సహనానికి అంతులేదని చెప్పవచ్చు. అతని హృదయంలో తనకు రవంత స్థానం ఉన్నదని విశ్వసించ గలిగినంతకాలమూ దీనికి తిరుగులేదు. ఆ స్థానం పోయినా స్త్రీలో మార్పు రాదు. కాని తిరస్కారం భరించే శక్తి మాత్రం స్త్రీకి లేదు.**

సారథి సాయంత్రం టీ తాగుతూ.

"బాగానే ఉంది, సారథి. లీలామహల్లో మంచి సినిమా వచ్చిందిట, వెడదామా?" అన్నది నిర్మల.

"తప్పకుండా వెడదాం, వదినా" అన్నాడు సారథి. వదినె తనదగ్గర ఏదో దాచిపెడుతూంది. వదినె ఎప్పుడూ ఇంతే అని విసుక్కున్నాడు సారథి. వదినె కనుబొమ్మలు అందంగా నవ్వుతాయి. అవి ముడుచుకుపోతే ఈ ప్రపంచమే ముడుచుకు పోతున్నట్లుంటుంది సారథికి.

ఎప్పుడూ చూసే సౌందర్యం చూడక పోతే బాధగానే ఉంటుంది.

కారు పార్కుచేసి హాలుపైకి మెట్లెక్కి వెడుతూండగా డేవిడ్, "నమస్తే, మేడమ్" అన్నాడు. అతని పక్కన గళ్లగళ్ల గౌను వేసుకున్న సన్నటి అమ్మాయి ఉంది.

"నాభార్య, లిల్లీ డేవిడ్" అని పరిచయం చేసి, "బాస్ రాలేదేం, మేడమ్? ఆయన కులాసాగా ఉన్నారా? సిక్ లీవ్ పెట్టారనుకుంటాను" అన్నాడు డేవిడ్ వినయంగా.

"కులాసాగానే ఉన్నారు. స్నేహితుడిని చూడ డానికి వైజాగ్ వెళ్లారు. థాంక్స్!" అన్నది నిర్మల తన సీట్లో కూర్చుంటూ.

"అన్నయ్య క్యాంప్‌కి వెళ్లలేదూ?" అని సారథి ఆత్రుతగా, ఆశ్చర్యంగా వేసిన ప్రశ్నకు ఆమె జవాబు చెప్పలేదు. తెరవైపు చూస్తూ కూర్చుంది.

'ఏం మనిషి!' అనుకున్నాడు సారథి.

హాలులో దీపాలు ఆరిపోయాయి.

"అమ్మయ్య!" అని నిర్మల నిట్టూర్చడం వినపడింది సారథికి.

• • •

"ఇన్నాళ్లు పట్టిందేం ఈసారి క్యాంపు? చాలా చిక్కిపోయారు! యాపిల్ పళ్లు ఇక్కడే మరిచి పోయారేం?" అన్నది నిర్మల అతని కోటు విప్పదీస్తూ, బూడిదరంగు ఉలెన్ కోటు!

"అవును, నిర్మలా...వెధవది వెళ్లిందగ్గర నుంచి ఒకటే పని! నీ కోసం మంచి కాశ్మీర్ సిల్కు చీరె తెచ్చాను. అక్కడ ఒంటరిగా హోటల్ మీద ఒక్కణ్ణీ పడుకుంటే ధ్యాసంతా ఇక్కడే" అన్నాడు సుందరమూర్తి, నిర్మల భుజంమీద

## పి. సత్యవతి

చెయ్యివేసి. అతని చెయ్యి వేడిగా బరువుగా ఉంది.

"నాకు తెలుసును మీరు నన్ను విడిచి ఇన్నాళ్లుండలేరని" అని నవ్వింది నిర్మల.

నిర్మల, గదిలో దీపం ఆర్పివేసి ఆకుపచ్చ రంగు బెడ్‌లైటు వేసింది. గదంతా పచ్చగా ఉంది. సుందరమూర్తి నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

రాత్రి పన్నెండు గంటలవేళ పక్కగదిలో నుంచి వినవడుతున్న వెక్కిళ్ల చప్పుడు సారథికి ఆశ్చర్యం కలిగించలేదు. వదినను ఓదార్చాలను కున్నా, గడియపెట్టిన తలుపు అతనికి అనుమతి ఇవ్వదు.

నిస్సహాయంగా నిట్టూర్చిన సారథి కెందుకో అన్నయ్య మీద కోపం వచ్చింది. అమ్మ జ్ఞాపకం వచ్చింది. భయం వేసింది. పసిపిల్లవాడిలా దిండును కౌగలించుకుని కళ్లు గట్టిగా మూసుకున్నాడు.

మర్నాడు సుందరమూర్తి ఆఫీసుకు వెళ్లిన తరువాత ఇంకా గదిలోనే కూర్చున్న సారథిని చూసి, "అలా ఉన్నావేం, సారథీ?" అన్నది నిర్మల.

"చికాకుగా ఉంది, వదినా! కాలేజీకి వెళ్లా లనిపించడంలేదు" అన్నాడు సారథి నేలను చూస్తూ.

అతని నుదుటి మీద చెయ్యివేసి చూసింది. చల్లగానే ఉంది స్పర్శ.

"నీ మొహం! బాగానే ఉంది నీ ఆరోగ్యం. లేనిపోని ఆలోచనలతో చదువు చెడగొట్టుకోకు. పరీక్ష లొస్తున్నాయి" అన్నది మెత్తగా.

సారథి మాట్లాడలేకపోయాడు. మాసిపోయిన షర్టు మార్చుకుండానే దానిని ప్యాంటులో కుక్కుకుని సైకిలెక్కాడు.

'నేను నీ కేమవుతాను, సారథీ! నామీద నీ కెందు కింత ఆపేక్ష!' అనుకుంది నిర్మల.

• • •


పదకొండు గంటలవేళ టెలిగ్రాఫ్ మెసెంజర్ అందించిన కవరు విప్పి చూసు కుంది నిర్మల.

"స్టార్టింగ్ టునైట్ జి. టి. ఎక్స్‌ప్రెస్ —సునంద."

సునంద! తను కట్టిన పిచ్చుక గూళ్లన్నీ తన్నివేసి, తనను ఛీటికి మాటికి ఏడిపించిన సునంద!

"బస్సులో ఎన్ని జతల కళ్లు నీవంక తదేకంగా చూస్తున్నాయో చూడవే, నిర్మలా! నువ్వు క్రిందటి జన్మలో తిలోత్తమవా? ఊర్వశివా? అని సంబోధించి తీరక చస్తున్నాను" అంటూ తన భుజం పట్టి ఉడికించిన సునంద!

చార్మిస్ స్నో
మీ సౌందర్యమును పెంపొందించుటే గాక..
అన్ని ఋతువుల లోను.... కాపాడును




ప్రత్యేకమైన
సువాసనతో
కూడినది

CS.G.5 TEL.




అతనికి ఈ ఆత్మ విశ్వాసము ఎందువలన కలిగింది ?
ఫినిక్స్ 'టెరిలీన్'-కాటన్ సూటింగ్‌లు. 67% 'టెరిలీన్' 33% కాటన్ ...
చల్లగా సున్న దనిపిస్తుంది. మడతనుపాడు చేయవు. ప్రతిష్ఠను అధికము
చేయును. సాటిలేని విశిష్టత. మీరూ ఎందుకు ధరించ కూడదు ?

ఫినిక్స్ మిల్స్

చిల్లర షాపులు :
సికింద్రాబాద్ : 9/13, మహాత్మా గాంధీ రోడ్.
బెంగుళూరు : 41 కమ్మర్షియల్ స్ట్రీట్, 357, చిక్ పేట్.
విజయవాడ : కాళేశ్వరరావు రోడ్, గవర్నర్ పేట.


# ఎర్రంచు సిల్కు చీర

"నువ్వు చాలా అదృష్టవంతురాలివే, నిర్మలా! ప్రేమించి పెళ్లి చేసుకున్నావు. నీ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకుని నిన్ను గౌరవించగల భర్తను ఎన్నుకున్నావు" అంటూ అభినందిస్తూ సంతోషం పేజీల ఉత్తరం వ్రాసిన సునంద!

సునంద వస్తూంది నిర్మలను చూడడానికి!

నిర్మలకు బాధతో కూడిన సంతోషం కలిగింది. కళ్లనిండా నీళ్లు వచ్చాయి. అంత దుఃఖం లోనూ తెరలుతెరలుగా నవ్వొచ్చింది. తన గుండె చాలా బరువుగా ఉంది. అందులో ఉన్న బరువు నంతనూ సునందతో చెప్పుకుని కన్నీళ్ల రూపంలో బహిర్గతం చేసుకోగలిగితే?

ఎన్నెన్నో ఆలోచనలు మెదడు చుట్టూ పరిభ్రమించాయి. బేగమ్స్ గార్డెన్‌లో ఫౌంటెన్ దగ్గర కూర్చుని ఆర్గానిక్ కెమిస్ట్రీ క్లాసులు ఎగగొట్టిన రోజులు, లెక్చరర్లందరికీ ఏయే పేర్లు నప్పుతాయా అని గంటలకు గంటలు చర్చించిన రోజులు, లవర్స్ రాక్‌పై కూర్చుని సునందచేత ఎంకిపాటలు పాడించిన రోజులు, తెలుగు లెక్చరరుతో తగాదా పెట్టుకుని కాలేజీలో తన కిష్టమైన నాటకం వేయించిన రోజులు, కలలు తిని జీవించిన రోజులు, ఆశలే ఊపిరిగా బ్రతికిన రోజులు— ఆ రోజులు రావు. బరువు బాధ్యతలు లేని ఆ తేలిక జీవితం ఇక రాదు. ఆరు సంవత్సరాల వెనక్కు కాలం తిరోగమించదు. అది పేరాశ!

"సారథీ, రేపు సునంద వస్తోంది" అని సారథికి ఫోన్ చేసేవరకూ నిర్మలకు తృప్తి కలగలేదు.

"ఇంత చిక్కిపోయావేమే రాక్షసీ!" అని ముద్దుగా పలకరించిన సునందను అమాంతం కౌగలించుకుని తనివితీరా రోదించాలనిపించింది నిర్మలకు.

చదువు నేర్పిన సంస్కారం, భర్త ఉద్యోగం నేర్పిన హుందాతనం మేళవించి చిరునవ్వు నవ్వుతూ, "ప్రేమించే వాళ్ల కళ్లకి ప్రేమింపబడేవాళ్లు చిక్కినట్లే కనిపిస్తారులే! పద, స్నానం చేసి కాఫీ తీసుకో" అని సునందభుజం తట్టింది.

"చాలా మాటలు నేర్చావే!" అని వెక్కిరించింది సునంద.

సాయంత్రం ఇంటి ముంగిట పూలతోటలో కుర్చీలు వేసుకుని కూర్చుని సునంద చెప్పే కబుర్లు వింటూంది నిర్మల.

"అవునే, నిర్మలా! నాకు మీవారు చాలాసార్లు వైజాగ్‌లో కనపడ్డారు. నే నెంత పలకరించాలని ప్రయత్నించినా ఆయన నన్నెరగనట్లే పోయారు. ఈమధ్యన ప్రామోషన్ ఏమైనా వచ్చిందేమో? నాబోటివాళ్లు కనపడడంలేదు అనుకున్నాను" అంది సునంద ఉన్నట్లుండి.

"ఆయనకి ఆడవాళ్లంటే చాలా సిగ్గని నీకు

చాలాసార్లు చెప్పాను, సునందా. పని తొందరలో హడావుడిగా వెళ్లిపోయువుంటారు'' అంది నిర్మల.

''బాగా సమర్థించావులే, చిట్టితల్లీ! ఒకసారి ఆయన బీచిలో కనపడ్డారు. వెంట ఎవరో చిలకమ్మ కూడా ఉంది. బారెడు పొడుగు గుర్రపు తోకా ఆవిడాను. ఆడవాళ్లంటే సిగ్గు నీకేమో! ఆయునకి కాదు'' అన్నది సునంద.

సునందతో వచ్చిన చిక్కే అది. సూటిగా ఉన్న దున్నట్లు, తన మనసులో అనుకున్నట్లు మాట్లాడుతుంది. తన భావాలకు మెరుగు పూలు పెట్టి ఇతరుల మనస్సు నొవ్వకుండా మాట్లాడడం చేతకాని అమాయకురాలు.

''అవును, ఆవిడ ఆయన స్నేహితుడి భార్యలే. స్నేహితుడు కూడా ఆ చుట్టుపక్కల ఉండే ఉండచ్చు. ఆయన చాలా మంచివారని చెప్పడానికి కాదు. ఆయన చాలా...'' అంటూ మాటలు దొరక్క ఆయాసపడి కుర్చీలో వెనక్కు వాలిన నిర్మల పెదవులు వణికాయి.

''ఆ! ఆ! ఎవరో మగవాళ్లూ ఉండచ్చులే—నే కాదన్నానా! నాతో ఎందుకు మాట్లాడరాదూ అని నా ప్రశ్న. నీ యోగక్షేమాలు తెలుసు కుందునుగా?'' అని అక్కడితో ముగించి లేచిన సునందకు మనస్సులో నమస్కరించింది నిర్మల.


ఏ విషయాన్నీ తీవ్రంగా ఆలోచించి బాధ పడి, బాధపెట్టడం సునంద తరహా కానందుకు నిర్మల సునందను అభినందించుకుంది.

సునంద వారంరోజులు ఉన్నది.

''మీ ఆయన ఇంట్లో ఉంటారేమో అను కున్నాను'' అంటూ ఆయనను చూడలేనందుకు నొచ్చుకుంది. చిన్ననాటి చెలిమి ఇచ్చిన చనువు సునందతో ఏదో చెప్పుకుని ఉపశాంతి పొందమని ప్రోత్సహిస్తే, సుందరమూర్తిపై ఉండే అభి మానం, అనురాగం, ఆమె ముఖంలో లేనిపోని చిరునవ్వులు, చమత్కారాలు వెలిగించేవి. ఆ పోరాటంలో సునంద చనువు పరాజయం పొందక తప్పనేలేదు. ఎవరి అంతరాత్మే వారి మిత్రురాలు. తన కన్నీళ్లు తుడిచి ఓదార్చగలిగేదీ, ఏకాంతంలో బాధలూ భయాలూ తలుచుకుని నిలువెల్లా వణికిపోయినప్పుడు భుజం మీద చెయ్యి వేసి, మెత్తగా తట్టి ఓదార్చేదీ స్నేహితురాలూ కాదు; తన ఇష్టాయిష్టాలూ, అభిరుచులూ, అభి ప్రాయాలూ ఎవరికోసం మార్చుకుని ఆత్మా ర్పణ చేసుకోడానికి సిద్ధపడిందో, ఆ భర్తా కాదు.

'తనే తన మిత్రురాలు' అనుకునేసరికి నిర్మ లకు భయముూవేసింది. నిర్లిప్తతా ఆవరించింది.

ఉదయమే మెయిలుకు సునందను ఎక్కించి వస్తున్నప్పుడు నిర్మల నిర్జీవంగా నవ్వుకుంది. ప్లాట్‌ఫారంపై వెలుగుతున్న నియాన్ లైట్ల తెల్లదనంలో ఎక్కడో సిల్కుచీరె ఎర్రంచు ప్రతిఫలించినట్లే అనిపించింది. ఎన్నో బూడిద రంగు ఉలెన్‌కోట్లూ, ఎన్నెన్నో ఎర్రంచు సిల్కు చీరెలూ మెయిలు ఎక్కి, దిగుతాయి. ఎందుకు బాధపడాలి?


సుఖ స్వప్నములు
వుడ్‌వార్డ్స్ కు
ధన్యవాదాలు!

కుట్టునొప్పి, పుల్లదనం, కడుపు ఉబ్బరం, పళ్లుచేయునపుడు కలిగే జబ్బులకు, వాడేది
వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్

తెలివైన తల్లులు
100 ఏళ్ల నుంచి వాడు చున్నారు.




Aiyars ATC-508 TEL




- రాగి అడుగు భాగములతో ఆహారము కాలిపోదు, మాడిపోదు.
- అవి వేడిని సమముగా ఎక్కేలా చేస్తాయి.
- వాటిని శుభ్రపరచుట, శుభ్రముగా ఉంచుట సులభము...కడిగి తుడిచివేస్తే చాలును!

రాగి అడుగు భాగములుగల స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు వంటకు అత్యుత్తమమైనవి. అంతేకాక అవి ఒక జీవితకాలం మన్నుతాయి. వాటిని నేడే కొనండి. వాటితో వండడము సరదాగా వుంటుంది.... శుభ్రము చేయుడము ఎంతో తేలిక!

అవి మీ దగ్గరలో లభించకపోతే ఉత్పత్తిదార్ల ప్రతినిధికి వ్రాయండి.

మహాలక్ష్మి మెటల్ ఇండస్ట్రీస్

192 బి, పంజారపోల్ రోడ్, బొంబాయి-4

ఈ ట్రేడ్ మార్క్ కోసం చూడండి Meghdoot

LPE Aiyars / 3 TEL


# ఎర్రంచు సిల్కు చీర

"నువ్వు రోజు రోజుకూ చిక్కిపోయి, పాలిపోతున్నావు, అక్కయ్యా. మందు తినరాదూ?" అని చెల్లెలు అన్నప్పుడు; "ఇక్కడికొచ్చి రెండు నెలలుండరాదుటే, నిర్మలా? విశ్రాంతిగా ఉంటుంది. మందూతినవచ్చు. పిల్లలంతా నీ కోసం కలవరిస్తున్నారు" అని అమ్మ బ్రతిమిలాడినప్పుడు; "అల్లుడుతో చెప్పి ఇక్కడికొచ్చి కొన్నాళ్ళుండమ్మా" అని తండ్రి ఉత్తరం వ్రాసినప్పుడు—ఎప్పుడూ నిర్మల కళ్లల్లో నీళ్ళు చింద లేదు.

"అమ్మ ఉంటే—వదినె ఇలా అయిపోయేదికాదు" అని సారథి పలుమార్లు నిట్టూర్చి ఆవేదనతో తపన చెందేవాడు. అదీ కదిలించలేదు నిర్మలను.

యాంత్రికంగా పనులు చేస్తూ, చదివిన పుస్తకంలోని చూసిన పేజీలే పదే పదే చూస్తూ, రేడియోలో విన్న పాటలే మరీ మరీ వింటూ, చూసిన సినిమాలే తిరిగి తిరిగి చూస్తూ కాలం వెళ్లదీయుడం ఎంత కష్టమో తెలుస్తూనే ఉంది.

కాలెండరులో కాగితాలు చిరుగుతూనే ఉన్నాయి. సూర్యోదయ సూర్యాస్తమయాలు క్రమం తప్పక జరుగుతూనే ఉన్నాయి.

"అన్నయ్య ఈ సంవత్సరంలో ఎన్ని రోజులు ఇంట్లో ఉన్నాడు, వదినా?" అని సారథి దిగులుగా అడిగినప్పుడు, "ఆయనకు పని భారం ఎక్కువైంది, సారథీ. బాధ్యత కలిగిన ఉద్యోగం కదా? అదీకాక మీ అన్నయ్యకి ప్రమోషన్‌మీద ఆపేక్ష ఎక్కువ" అనగలిగే సహనాన్ని ఆమె కోల్పోనే లేదు.

• • •

టెలిగ్రాఫ్ మెసెంజర్ ఇచ్చిన ఎర్రని కాగితం కోటు జేబులోనుంచి గుండెల్లో గుచ్చుకుంటూ ఉండగా విజయవాడ వెళ్లే పాసెంజర్ ఎక్కాడు మిస్టర్ సుందరమూర్తి, సి. ఎ.

"మనదేశంలో చదువూ సంస్కారంలేని స్త్రీలే ఎక్కువ సుఖపడగలుగుతున్నారేమో? ప్రేమాను రాగాలు, చదువు సంస్కారాలు ఆత్మ వినాశనానికి దోహదం చేస్తాయని ఎవరనుకుంటారు ? తన నోటి దుడుకుతనంతో అసహనంతో అమ్మ నాన్న ప్రవర్తనను మార్చి అదుపులో పెట్ట గలిగింది. సంస్కారంతో ప్రేమాభిమానాలతో వదినె, తనపై తాను ప్రేమించినవారికి గల వాత్సల్యానురాగాలు కోల్పోయింది. ఈ ప్రపంచంలో ఏవిఎందుకు ఎలా జరుగుతున్నాయో తెలివి అయోమయస్థితి నన్నావరించింది....." అని వ్రాసుకున్నాడు డైరీలో నిర్మల మరిది సారథి.

"హార్ట్ ఎటాక్" అన్నాడు డాక్టరు.

చితిలోనుంచి, సిల్కు చీర ఎర్రంచువంటి మంటలు పైకెగసి సుందరమూర్తి హృదయాన్ని దహించివేశాయి. ★